తలరాతను మార్చే చేతిరాత

- దస్తూరీ బాగుంటే మంచి మార్కులు
- వేసవిలో శిక్షణ తరగతులు

సీటీఆర్ఐ: పెన్నుతో పేపర్ మీద ముత్యాల్లాంటి అక్షరాలను చూసి చాలాకాలం అవుతుంది. గతంలో పిల్లలకు కాపీ పుస్తకాలు ఉండేవి. ఫైలైన్‌లో ఉన్న అక్షరాలను యథాతథంగా రాసి దస్తూరిని మెరుగు పరుచుకోనేవారు. కానీ నేటితరం సాంకేతికతతో పరుగులు తీస్తోంది. తరగతి గదిలో ఉపాధ్యాయుడు చెప్పే విషయాలను పుస్తకాలలో రాసుకోవడం తగ్గిపోయింది. పాఠాలను వాయిస్ రికార్డు చేయడం ద్వారా అక్షరాలుగా మార్చే మొబైల్స్ రావడంతో చేతితో టైప్ చేసే అలవాటు పూర్తిగా తప్పుతోంది. కానీ పరీక్షలలో విద్యార్థులు ప్రశ్నాపత్రానికి ఎంత గొప్పగా సమాధానాలు రాసినా, చేతిరాత బాగోకపోతే వారికి మార్కులు రావు.

ముత్యాల్లాంటి అక్షరాలు

ముత్యాల్లాంటి అక్షరాలను చూస్తే విషయం ఏదైనా చదవాలనిపిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం ఎన్ని పరుగులు తీస్తున్నా, మంచి చేతిరాత నేటికి ప్రాధాన్యం కోల్పోలేదు. పరీక్ష పేపర్లు దిద్దే వారికి చేతిరాతను బట్టి మార్కులు వేస్తారు. చేతిరాత (దస్తూరి) అనేది కేవలం చదువుకు సంబంధించినది మాత్రమే కాదు. అది ఒక కళ అంటున్నారు చేతిరాతల నిపుణులు.



చేతిరాతలో మెళకువలు నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

చేతిరాతకు మార్కులు

గతంలో పరీక్షల్లో మంచి చేతిరాతకు విద్యార్థులకు మార్కులు కేటాయించేవారు. పోటీ పరీక్షలలో కూడా ఈ సంప్రదాయం కొనసాగింది. గజిబిజిగా రాసిన అక్షరాలలో ఎంత మంచి భావాలను వ్యక్తం చేసినా, చదవడానికి ఆసక్తి ఉండదు. చేతిరాత మన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది. అందమైన చేతిరాత ఉన్న వ్యక్తి భావ ప్రకటనా సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని గ్రాఫాలజీ చెబుతోంది. మహాత్మాగాంధీ తన చేతిరాత బాగుండకపోవడంపై స్వీయ చరిత్రలో ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాత చేతిరాతను మెరుగుపరుచుకోవడానికి కృషి చేశారు.

15 ఏళ్ల అనుభవం



ఈ రంగంలో 15 ఏళ్ల అనుభవం ఉంది. మంచి చేతిరాత అలవరుచుకోవడానికి మెళకువలను నేర్పుతున్నాను. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ 2.6 లక్షల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చాను.

– రవి పరస, నఖచిత్రకారుడు, చేతిరాత నిపుణుడు

శిక్షణ సంస్థలు

వేసవి సెలవుల్లో చిన్నారులకు చేతిరాతపై శిక్షణ ఇవ్వడానికి నగరంలో కొన్ని సంస్థలు పనిచేస్తున్నాయి. ఇక్కడ మంచి చేతిరాతను అలవర్చుకోవడంపై తరగతులు నిర్వహిస్తారు.

అక్షరాలు ఒకే సైజులో ఎలా రాయాలి, పదాలకు మధ్య ఎంత దూరం ఉండాలి. రాసేటప్పుడు పెన్ను ఎలా పట్టుకోవాలి, ఒకే లైను మీద రాస్తున్నట్లు ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో నేర్పుతారు.

సుందర నగరంగా రాజమహేంద్రవరం

- కలెక్టర్ ప్రశాంతి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీటీఆర్ఐ: పుష్కరాల పనుల్లో భాగంగా రాజమహేంద్రవరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గోదావరి గట్టున ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద రూ.8 కోట్లతో చేపట్టే రివర్ ఫ్రంట్ అప్పర్ ప్రొమినేడ్ అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్యాలరీలో నమూనా ఫోటోలను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాల సమయంలో రోజూ సుమారు 10 లక్షల మంది ఈ ప్రాంతానికి వస్తారనే అంచనా వేస్తున్నామన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద కేంద్ర పర్యాటక శాఖ ద్వారా రూ. 100 కోట్ల నిధులు మంజూరైనట్టు తెలిపారు. ఈ నిధులలో రూ.97 కోట్లు ఒక్క రాజమహేంద్రవరానికే కేటాయించగా పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని వెల్లడించారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా మార్చడమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి పాల్గొన్నారు.

చల్లా సత్యవాణి సేవలు అభినందనీయం

సీటీఆర్ఐ: ఆధ్యాత్మిక రచన చేస్తూ, ఉచితంగా పుస్తక వితరణ చేస్తున్న డాక్టర్ మేజర్ చల్లా సత్యవాణి సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతి నది పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఆమె రచించిన సరస్వతీ నది పుష్కర క్షేత్ర దర్శిని పుస్తకావిష్కరణ సభ బుధవారం స్థానిక సరస్వతీ ఘాట్‌లోని జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. పుస్తకాన్ని ఆలయ వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు ఆవిష్కరించారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ మాట్లాడుతూ సరస్వతీ నది గురించి పుస్తకంలో చక్కగా వివరించారన్నారు. డాక్టర్ సత్యవేణి 40 పుస్తకాలు రచించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో రాజమహేంద్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి, విశ్రాంత అధ్యాపకురాలు డాక్టర్ కాసా జయప్రద పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తోట సుబ్బారావు తదితరులు

ఫోరెన్సిక్ సైన్స్ మేనేజ్‌మెంట్‌పై వర్క్‌షాప్

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆధ్వర్యంలో బుధవారం ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై ఫోరెన్సిక్ శాస్త్ర నిపుణులతో వర్క్‌షాప్ నిర్వహించారు. మంగళగిరి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు చెందిన ప్రముఖ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు హాజరై జిల్లా పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్ మాట్లాడుతూ నేటి ఆధునిక సాంకేతిక యుగంలో నేరస్తులు దర్యాప్తును తప్పుదోవ పట్టించడానికి కొత్త పద్ధతులను ఉపయోగిస్తున్నారన్నారు. అటువంటి వారిని సమర్థవంతంగా పట్టుకోవాలంటే, పోలీసు అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, దర్యాప్తు పద్ధతులపై లోతైన అవగాహన కలిగి ఉండాలన్నారు. హత్యలు, అత్యాచారాలు, అనుమానాస్పద మరణాలు, రోడ్డు ప్రమాదాలు వంటి ముఖ్యమైన కేసుల దర్యాప్తులో భౌతిక ఆధారాల సేకరణ, వాటిని ప్రాసెస్ చేసే విధానం, దర్యాప్తు అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టవలసిన అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీలు

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు



బహుమతులతో వివిధ పోటీల విజేతలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్యుల శ్యామసుందర్ సూచించారు. రాజమహేంద్రవరంలోని సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సత్యసాయి బాల వికాస్, శ్రీమతి ఈశ్వరమ్మ వర్ధంతి వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. భావితరాలకు వెలుగు బాటను చూపే బాలవికాస్‌లో సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలనే మానవతా విలువలు, పాఠశాల చదువుతో పాటు సంస్కారాన్ని, భారతీయ సంస్కృతిని, నైతిక, ఆధ్యాత్మిక జీవన విధానాన్ని నేర్పించే ఈ తరగతులకు తప్పనిసరిగా చిన్నారులను పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు దండమూడి గిరిధర్, కార్యదర్శి ఘంటా హనుమంతరావు, జోనల్ కన్వీనర్లు విజయసాయి, త్రిమూర్తులు, స్థానిక సేవా సమితి కన్వీనర్ రఘురామ్, భజన మండలి కన్వీనర్ కుమార్, నరసింహారావు, జిల్లా మెడికల్ ఇన్‌చార్జి యోగీశ్వరరావు, బాలవికాస్ గురువులు దివాకర్, సావిత్రి, శ్యామల, సునీత పాల్గొన్నారు.

వెలుగులు నింపేందుకు చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: పశు ఆధారిత ఉత్పత్తులపై జీవించే వారి జీవితాల్లో వెలుగు నింపేందుకు చర్యలు తీసుకొంటున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) టి.సీతారామమూర్తి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జంతువులపై క్రూరత్వ నివారణ జిల్లా కమిటీని ఏర్పాటు చేశామని, దీనిలో చైర్‌పర్సన్, ప్రెసిడెంట్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారన్నారు. యానిమల్ షెల్టర్ కోసం కోరుకొండ మండలం కనుమూరులో ఐదెకరాలను సర్వే చేయడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి టి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ, యానిమల్ వెల్ఫేర్ ఆఫీసర్ వి.కిరణ్ కుమార్, సభ్యులు తమ్మ రవి, బోడపాటి వెంకట ముత్యాలరావు, దేవరపల్లి సామ్రాజ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సీతారామమూర్తి

అల్లూరి సేవలు చిరస్మరణీయం



ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లో సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు



బొమ్మూరులో..



కడియంలో..

- కొనియాడిన వక్తలు
- ఆయన విగ్రహాలకు నివాళి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా బుధవారం విగ్రహాలు, చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని అల్లూరి విగ్రహానికి కోసూరి అప్పలరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు నందమూరి దుర్గారావు, అప్పలరాజు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత నేటికీ ప్రభుత్వాలు గిరిజనులు, ఆదివాసీల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. వెంటనే కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని ఆదివాసీల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

- బొమ్మూరు పంచాయతీ వీధిలో అల్లూరి విగ్రహానికి సయ్యపురాజు ఫణీంద్రరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లూరి బాటలో పయనిద్దాం

కడియం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు బాటలో పయనిద్దామని భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, దూలం వీర వెంకట సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని అల్లూరి విగ్రహానికి ఐఎఫ్‌టీయూ రైస్‌మిల్లు జట్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించారు.

పోరాట వీరుడు

సీటీఆర్ఐ: పోరాట వీరుడు అల్లూరి సీతారామరాజు అని ప్రముఖులు కొనియాడారు. నగరంలో పలు చోట్ల ఉన్న ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోదావరి గట్టున ఉన్న సీతారామరాజు విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి, సామాజిక కార్యకర్త దేసిరెడ్డి బలరామ నాయుడు పూలమాలలు వేశారు.

ఆదర్శప్రాయుడు

కడియం: అల్లూరి సీతారామరాజు జీవితం, ఆయన పోరాటం నేటి యువతకు ఆదర్శమని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళాసేవాసమితి అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం, బీజేపీ కడియం మండల అధ్యక్షుడు బొరుసు సుబ్రహ్మణ్యం, భగత్ సింగ్ సేవాసమితి అధ్యక్షుడు తమ్మిశెట్టి ప్రసాద్ అన్నారు. స్థానిక బ్రాహ్మణరేవు సమీపంలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సారా తయారీదారుడి అరెస్ట్

రంగంపేట: సారా తయారీదారుడిని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ దొడ్డిగుంట గ్రామంలో దాడులు నిర్వహించి, గార్లంకల సత్తిబాబును అరెస్టు చేశామన్నారు. అతడి నుంచి 240 కేజీల బెల్లం, బైకు స్వాధీనం చేసుకున్నామని, వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే సారా తయారు చేస్తున్న బొల్లంగి వీరబాబుపై కేసు నమోదు చేశామన్నారు.

పేకాట శిబిరంపై దాడి

సీతానగరం: వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేట శివారున పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. వారి నుంచి రూ. 8,270 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు. మండల గ్రామాల్లో కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

కోరుకొండ: వ్యసనాలకు, దురలవాట్లకు యువత దూరంగా ఉండాలని ఎస్సై కూనా నాగరాజు సూచించారు. ఈ మేరకు బుచ్చెంపేట, గుమ్ములూరు గ్రామాల్లో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, మద్యం, సారా, మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నాశనమవుతుందన్నారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కోరుకొండ మండలంలోని వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్న 23 మందిని అరెస్టు చేసినట్టు ఎస్సై నాగరాజు తెలిపారు. వారిపై కేసులు నమోదు చేశామని, గురువారం కోర్టులో హాజరు పర్చుతామన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడికి మాజీ ఎంపీ భరత్ పరామర్శ



సురేష్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ భరత్

సీటీఆర్ఐ: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు, 14 డివిజన్ ఇన్‌చార్జి పెంకె సురేష్‌ను మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ బుధవారం పరామర్శించారు. స్థానిక బుల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

భీమశంకరాన్ని పరామర్శించిన చందన



భవాని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు మాజీ సర్పంచ్ ఆత్తిలి భీమశంకరం, ఆయన కుటుంబ సభ్యులను బుధవారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఇటీవల భీమశంకరం భార్య భవాని మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి చందన నాగేశ్వర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఎంఎం ఆలీ, చెరుకూరి సత్యనారాయణ ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన



కడియం గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

కడియం: తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాలని విద్యార్థులకు రైతు నాయకుడు టి.రామారావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సాదు వెంకటేశ్వరరావు, భాస్కరరావు, దుర్గ తదితరులు జీవన నైపుణ్యాల గురించి తెలిపారు. రిసోర్స్‌పర్సన్ ప్రసాద్ తెలుగు వ్యాకరణం బోధించారు. లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల వందన సమర్పణ చేశారు. అల్లూరి సీతారామరాజు దేశానికి అందించిన సేవలను వివరించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ఆరుగురికి పదోన్నతి

కడియం: మండలంలోని ఆరుగురు సచివాలయ గ్రేడ్–6 కార్యదర్శుల (డిజిటల్ అసిస్టెంట్)కు గ్రేడ్ – 5 కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. మురమండ సచివాలయం – 1 నుంచి మర్రి కాశీ విశ్వనాథ్, కడియపులంక – 1, 2, 3, సచివాలయాల నుంచి దూడల రాఘవ, ఆకుల జగదీష్, గూడాల సుబ్రహ్మణ్యం, వేమగిరి 1 నుంచి కె.ప్రతాప్‌రాజు, దుళ్ల – 2 నుంచి చింతా యమున ఈ పదోన్నతులు పొందారు. కాకినాడలో ఈ నెల 14న జరిగే కౌన్సెలింగ్‌లో వీరికి స్థానాలు కేటాయించనున్నట్లు ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత

ప్రకాశం నగర్: మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె నోటీసును బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ షబ్నం అప్సర్‌కు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. పవన్, జిల్లా కార్యదర్శి బి. పూర్ణిమరాజు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కార్మిక హక్కుల హరించే లేబర్ కోడ్స్ రద్దు కోసం జరిగే ఈ సమ్మెలో కార్మిక వర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ రంగంలో కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున దోపిడీ గురవుతున్నారని, అతి తక్కువ వేతనాలకు పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జీరో షాడో డే

కంబాలచెరువు: విజ్ఞాన భారతి, ఏపీ కాస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఖగోళ శాస్త్ర అధ్యయనాలలో భాగంగా బుధవారం రాజమహేంద్రవరంలో జీరో షాడో డేని అభ్యసనం చేశారు. ఏపీ కాస్ట్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఖగోళ శాస్త్ర పరిశోధకురాలు మేకా సుసత్య రేఖ.. మెగా జూనియర్ కాలేజ్ విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 11.59 గంటలకు జీరో షాడో డేని పరిశీలించారు.

కొనసాగుతున్న సీహెచ్‌ఓల సమ్మె

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె బుధవారం 10వ రోజుకు చేరుకుంది. ఆ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మమత మాట్లాడుతూ ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. విలేజ్ క్లినిక్ అద్దె బకాయిలు, విద్యుత్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పీఎఫ్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్ఐ: స్థానిక సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సమీపంలో మార్గాని భరత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ప్రారంభించారు. అనంతరం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్ల వెంకన్న నర్సరీ సందర్శన



జైళ్ల శాఖ డీజీ అంజనీ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతులు

కడియం: స్థానిక పల్ల వెంకన్న నర్సరీని జైళ్ల శాఖ డీజీ అంజనీ కుమార్ బుధవారం సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేతలు పల్ల సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతి ఘనంగా స్వాగతం పలికారు. కడియం ప్రాంత నర్సరీ రైతులు ఎంతో నైపుణ్యంతో అభివృద్ధి చేస్తున్న సరికొత్త మొక్కల గురించి డీజీకి నర్సరీ రైతు పల్ల వినయ్ వివరించారు. డీజీ వెంట జైళ్లశాఖ ఉన్నతాధికారులు ఎంఆర్ రవికిరణ్, ఎస్.రాహుల్, ఎం.రాజ్‌కుమార్, పర్యావరణమిత్ర అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు ఉన్నారు.

వర్షాలపై అవగాహన కల్పించాలి

రాజమహేంద్రవరం రూరల్: రానున్న ఏడు రోజులు ఉరుములు, మెరుపులతో అధిక వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో క్షేత్ర స్థాయి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి బుధవారంక్షేత్ర స్థాయి అధికారులకు సూచనలు చేశారు. ఎటువంటి పశు, మానవ ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి



రాజకుమారి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవీ మాత

ధవళేశ్వరం: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని బుధవారం ధవళేశ్వరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పువ్వుల తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. రాజకుమారి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం కన్నెపిల్లలచే వాసవీ మాతకు సువాసిని పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ రకాల పూలతో ముస్తాబుచేసిన రథంపై అమ్మవారి గ్రామోత్సవం జరిగింది.

సినిమాలు



శ్యామల	: జింఖానా
సూర్యమినీ	: రైడ్–2
సూర్యప్యాలెస్	: థండర్‌బోల్ట్స్
స్వామి	: హిట్–3
శివజ్యోతి	: హిట్–3
అనుశ్రీ	: హిట్–3
రాజా	: హిట్–3
ఊర్వశి	: హిట్–3
మేనక	: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
రంభ	: గుడ్‌బ్యాడ్‌అగ్లీ, అన్‌టిల్‌డాన్
కుమారి	: సారంగపాణిజాతకం
అప్సర	: రెట్రో
అశోక	: రెట్రో
నామవరం	
వీఎస్‌మహల్	: హిట్–3
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: హిట్–3
కడియం	
వెంకటసూర్య	: హిట్–3